క్లుప్తంగా

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



ఆత్మకూరు : గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు మండల కేంద్రంలో చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా కనీస వేతనం రూ.15 వేలకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీఓ నెంబర్ 51ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. కారోబార్లకు, బిల్ కలెక్టర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు మల్లారెడ్డి, రాంబాబు, నరేష్, రాజు, బాబు, నర్సింహారావు, సదానందం, పద్మ, ప్రసన్న, కిషన్ పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

● 40 లీటర్ల గుడుంబా, ఆటో స్వాధీనం



శాయంపేట : ప్రభుత్వ నిషేధిత గుడుంబా (నాటుసారా)ను ఆటోలో అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పరకాల ఎక్సైజ్ సీఐ జగన్నాధరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని సూర్యనాయక్‌తండా గ్రామానికి చెందిన మాలోతు సుధాకర్, అజ్మీర కృష్ణ ఆటోలో గుడుంబాను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోలో 40 లీటర్ల గుడుంబా లభ్యమైంది. వెంటనే ఆటోను, గుడుంబా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఐనవోలు : రెండు ఇసుక ట్రాక్టర్లను ఐనవోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై గుగులోతు వెంకన్న కథనం ప్రకారం.. మండలంలోని నందనం ఆకేరు వాగు పరిసర ప్రాంతాల్లో సోమవారం ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై వెంకన్న హెచ్చరించారు.

'సీఎం కప్'కు పేర్లు నమోదు చేసుకోవాలి

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న సీఎం కప్-2023 క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు ఈనెల 11న సాయంత్రం 5 గంటలలోపు మండల పరిషత్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 నుంచి 17 వరకు స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్ ఆవరణలోని క్రీడా మైదానంలో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడల్లో స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చని తెలిపారు. అలాగే ఫుట్‌బాల్ క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు పురుషులు మాత్రమే పేర్లు నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు.

హనుమాన్ శోభాయాత్ర



ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామంలో మాలధారులు హనుమాన్ శోభాయాత్రను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లో శోభాయాత్ర కొనసాగింది. కార్యక్రమంలో గురుస్వాములు మడికంటి సాయిబాబు, పుట్ట చంద్రు, మాచర్ల సాంబరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆత్మకూరు : మండలంలోని గూడెప్పాడ్ గ్రామంలోని ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్‌లో నేడు (మంగళవారం) మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు ఆ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాధ రవియాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మండల రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

బాధిత మహిళలకు అండగా 'సఖి'



మాట్లాడుతున్న న్యాయవాది శోభారాణి

ఐనవోలు : ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సఖి' కేంద్రం బాధిత మహిళలకు, బాలికలకు అండగా నిలవడమే లక్ష్యంగా పని చేస్తున్నాయని ప్రముఖ న్యాయవాది శోభారాణి, సఖి సోషల్ కౌన్సిలర్ నిర్మలాదేవి తెలిపారు. మండలంలోని పంథిని గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సఖి కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై మహిళలకు వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడారు. మహిళల, బాలికల హక్కులు, రక్షణ చట్టాల గురించి వివరించారు. పోక్సో, బాల్య వివాహ నిషేధిత చట్టాలపై అవగాహన కల్పించారు. సఖి సెంటర్‌లో బాధిత మహిళలకు లభించే సేవల గురించి తెలిపారు. మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న వేదింపులు, సోషల్ మీడియా ద్వారా ఎదురౌతున్న సమస్యలపై చర్చించారు. లైంగిక వేదింపులు, యాసిడ్ దాడులు, అక్రమ రవాణాపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాధిత మహిళలకు సహాయం అందించడానికి సఖి కేంద్రం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న సఖి సెంటర్‌లో కౌన్సిలింగ్, వైద్య సాయం, తాత్కాలిక వసతి, పోలీస్ సాయం, న్యాయ సహాయం బాధిత మహిళలకు, బాలికలకు ఉచితంగా అందుతాయని తెలిపారు. మహిళలు, బాలికలు అత్యవసర పరిస్థితుల్లో మహిళా హెల్ప్‌లైన్ 181, 1098, 100, 0870-2935014లకు ఫోన్ చేయాలని చెప్పారు. సత్వరమే సహాయం అందుతుందని స్పష్టం చేశారు. బాధితులు ఏ సమయంలోనైనా సఖి కేంద్రాన్ని ఆశ్రయించవచ్చని తెలిపారు. సఖి కేంద్రానికి రాలేని పరిస్థితుల్లో ఉంటే సఖి టీం రెస్క్యూ చేసి కాపాడుతుందని వివరించారు. కార్యక్రమంలో మహిళ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఆలయ భూముల రికార్డులు తారుమారు'



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఎల్కతుర్తి : కొందరు అక్రమార్కులు ఆలయ భూమిని ఆక్రమించుకొని రికార్డులను తారుమారు చేసి తిరిగి ప్రభుత్వ భూమిగా చూపించారంటూ భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామస్తులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. వంగర శివారులో ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం మొదటి దశ కింద 200 ఎకరాల భూములను సేకరించి రైతులకు పరిహారం చెల్లించిందన్నారు. వంగర గ్రామంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయం పేరిట ఉన్న 3.4 ఎకరాల భూమి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం ఇచ్చి డబ్బులు దండుకునేందుకు కొందరు రికార్డులు తారుమారు చేశారని చెప్పారు. ఆ భూమినే తిరిగి ప్రభుత్వ భూమిగా చూపించారని తెలిపారు. భూముల వ్యవహారంలో రాజకీయ నాయకుల, రెవెన్యూ అధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపించారు. ఆలయ భూములను ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం సేకరిస్తే సదరు పరిహారం డబ్బులు ఆలయ ఖాతాలో జమ చేయాలని లేదా ఆలయ భూములకు పట్టా పాస్ బుక్కులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు గజ్జెల సురేష్, శ్రీనివాస్, ప్రదీప్, అయిలయ్య, కుమారస్వామి, తిరుపతి, సంపత్, కమలమ్మ, భారతమ్మ, రామారావు, రవీందర్, వేణు, శ్రీహరి, యాదగిరి, లింగాచారి, చిరంజీవి, సధానందం, మొండయ్య, రాజ్‌కుమార్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఎమ్మెల్యేల జాబితా వెల్లడించాలి

● ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష



దీక్షలో మాట్లాడుతున్న సుకుమార్

పరకాల : దళితబంధు పథకంలో దళితుల నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు చొప్పున దండుకున్న ఎమ్మెల్యేల జాబితాను వెల్లడించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గద్దల సుకుమార్ సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. ఆ పార్టీ పట్టణ కమిటీ ఇన్‌చార్జ్ బొచ్చు అనంత్ అధ్యక్షతన పట్టణంలో చేపట్టిన నిరసన దీక్షను సుకుమార్ ప్రారంభించి మాట్లాడారు. దళితబంధు పథకంలో పేద దళితుల నుంచి అక్రమంగా డబ్బులు దండుకోవడం దుర్మార్గమన్నారు. అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అవినీతి పాల్పడిన వారిని హెచ్చరించి వదిలేయడం అవినీతిని ప్రోత్సహించడమే అవుతుందన్నారు. అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయని పక్షంలో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నాయకులు పాముల సుబ్బయ్య, గోవిందు రవికుమార్, ఎమ్మార్పీఎస్ దామెర మండల కన్వీనర్ పదిమల పాల్, గోవిందు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి

దామెర : దళితబంధు పథకాన్ని వర్తింపజేస్తామంటూ అవినీతికి పాల్పడ్డ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి కి పాల్పడ్డ ఎమ్మెల్యేలను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతోపాటు బాధితులకు డబ్బులు ఇప్పించి పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 10న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పరిమల పాల్, పాముల సుబ్బన్న, గోవిందు కిరణ్, బొర్ర జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'మత్స్యగిరిస్వామి' బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న వేద పండితులు

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీ మత్స్యగిరి స్వామి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పండితులను సన్మానించారు. ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమూర్తి, యాగ్నికులు రంగనాధచార్యులు స్వామి వారికి విశ్వక్సేన ఆరాధన స్వస్తి, పుణ్యాహవచనము, ద్వాదశ ఆరాధనలతో 12 రకాల పుష్పాలతో పుష్పయాగాన్ని, నాగవెల్లి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలనుపల్లకిలో ఊరేగించారు. పండిత సన్మానంతో ఉత్సవాలు పరిసమాప్తి అయినట్లు చైర్మన్ ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ కందగట్ల రవి, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, గ్రామపెద్దలు జిన్న ప్రతాప్‌సేనారెడ్డి, కృపాకర్‌రెడ్డి దిండిగాల వంశీ, శివ, వేణు, ప్రకాశ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థికసాయం



సాయం అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్, తదితరులు

దామెర : మండలంలోని దుర్గంపేట్ గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ కూనమల్ల సురేందర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఫోటో, వీడియోగ్రాఫర్ల సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రూ.10 వేల సాయం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు దామెర ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఫొటోగ్రాఫర్ సురేందర్ మృతి బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షులు గోల్కొండ సతీష్, జన్ను కమల్, కోశాధికారి గుండ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు గడబోయిన రమేష్, బైకని కార్తీక్, ఆనంద్, తుమ్మ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ధర్నా

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ (కేయూ)లోని పరిపాలన భవనం ఎదుట కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని కాంట్రాక్ట్ లెక్చరర్లు సోమవారం ధర్నా చేశారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసిన విధంగానే యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యకమంలో జేఏసీ బాధ్యులు చిర్ర రాజు, సూర్యనారాయణ, శంకరయ్య, కొడిగ సతీష్, వెంకట గోపీనాథ్, సత్యజాల, మామిడాల లింగయ్య, సూర్యం, బ్రహ్మయ్య, ఫిరోజ్‌పాషా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు అన్ని రంగాల్లో ఎదగాలి

మడికొండ: పద్మశాలీ కులస్తులు అన్ని రంగాల్లో ఎదగాలని పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు నామని కుమారస్వామి అన్నారు. పద్మశాలి సంఘం భవనంలో సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా నామని కుమారస్వామి, కార్యదర్శిగా తాటిపాముల సత్యనారాయణ, కోశాధికారిగా కన్నె మల్లేశం, ఉపాధ్యక్షుడిగా పొట్లబత్తిని సారంగపాణి, సహాయ కార్యదర్శిగా చిదురాల వెంకటేశ్వర్లు ఎన్నికైన నట్లు సంఘం కార్యదర్శి మల్లేశం, ఎన్నిక కమిటీ అధికారి కోమాకుల సమ్మయ్య తెలిపారు. కార్యక్రమంలో నామని రాంమోహన్‌రావు, కేటిక సదానందం, వంగ రమేష్, నల్ల ప్రభాకర్, పొట్లబత్తిని లక్ష్మణ్, నల్ల రాజేందర్, పోతరాజు ప్రకాష్, చిలువేరు సంతోష్ పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెక్కుల పంపిణీ



శాయంపేట : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న మిర్చి, మొక్కజొన్న పంటలకు సంబంధించి బాధిత రైతులకు మంజూరైన పరిహారం చెక్కులను మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని 171 మంది మిర్చి, 151 మంది మొక్కజొన్న రైతులకు పరిహారం మంజూరైందని చెప్పారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం



ఐనవోలు : మండల కేంద్రంలో బొడ్రాయి షష్టమ వారికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2017లో బొడ్రాయి ప్రతిష్ఠాపన నిర్వహించగా గ్రామ సర్పంచ్ జన్ను కుమారస్వామి ఆధ్వర్యంలో భూలక్ష్మీ, మహాలక్ష్మీ, బొడ్రాయి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఐనవోలు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మునిగాల సంపత్, ఉపసర్పంచ్ అడ్డగూడి సతీష్, సొసైటీ డైరెక్టర్ వడిచర్ల శ్రీనివాస్, సమ్మయ్య, రాములు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

దామెర : మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ గారె హరికృష్ణ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందగా అతడి మృతదేహానికి సూర్య ట్రస్ట్ చైర్మన్, గూడెప్పాడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గజ్జి విష్ణు సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని విష్ణు ఓదార్చి పరామర్శించారు. అలాగే రూ.5 వేల సాయం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గజ్జి సూరయ్య, సర్పంచ్ మేడిపల్లి సాంబయ్య, నాయకులు సైలాన్, క్రాంతి, గజ్జి నర్సన్న, దామెర రవి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో ముందుండాలి

హన్మకొండ: విద్యార్థులు చదువుల్లో రాణించాలని తెలంగాణ వికాస సమితి హనుమకొండ జిల్లా కన్వీనర్ నిమ్మల శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని కాకతీయ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని డిగ్రీ విద్యార్థులకు 'భారత రాజ్యాంగం – విలువలు – విశిష్టత' అనే అంశంపై సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను కాపాడాల్సిన బాధ్యత యువతపై ఉందని గుర్తుచేశారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మట్టెవాడ మాధవ్, గుండా హరినారాయణ, దయాకర్, రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాంచందర్, అధ్యాపకులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీనగర్ అభివృద్ధి కమిటీ ఎన్నిక

హన్మకొండ: హనుమకొండలోని గాంధీనగర్ అభివృద్ధి కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెరుకు వెంకటరాజిరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా నక్క లింగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మూగల కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.వీరేందర్, ఆర్.నారాయణరెడ్డి, డి.కమలాకర్, ప్రధాన కార్యదర్శిగా నట్ల సత్తయ్య, కోశాధికారిగా గోపగాని అశోక్, సంయుక్త కార్యదర్శులుగా సీహెచ్.తిరుపతిరెడ్డి, బీ.కనుకయ్య, ఏ.శ్యాంప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా బీ.రమేష్, కే.జనార్దన్‌రెడ్డి, కే.యాదగిరి, బీ.శ్రీనివాస్ రెడ్డి, ఎన్.సుభాష్, ఎన్.అశోక్ రెడ్డి, ఏ.సురేందర్, జి.రామకృష్ణ, ఏ.మల్లారెడ్డి, జీ.రాజిరెడ్డి, జే.దయాకర్, వీ.నరేందర్, ముఖ్య సలహాదారులుగా డీ.వేణుగోపాల్ రావు, ఏవీ.నర్సింహరావు, ఈవీ.శ్రీనివాస్ రావు, పీ.రాజేందర్ కుమార్, ఆడిట్ కమిటీ సభ్యులుగా వీ.ప్రభాకర్, ఎం.రామకృష్ణారెడ్డి, పీవీ.రమణ, కే.శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీని కాలనీవాసులు అభినందించారు.

రాజ్యాంగాన్ని ప్రజలకు అందించాలి



కమలాపూర్ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కమలాపూర్ : భారత రాజ్యాంగ గ్రంధాన్ని దేశ పౌరులందరికి ఉచితంగా అందించాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి చిలువేరు శ్రీకాంత్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ పాలెపాక రాణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడారు. రాజ్యాంగ ప్రకారమే దేశంలో పాలన సాగుతున్నా, దానిపై 90 శాతం జనాభాకు సరైన అవగాహన లేదని తెలిపారు. ఈ క్రమంలోనే పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్యం విఫలతౌతున్నట్లు చెప్పారు. సమాజంలోని ప్రతిఒక్కరికీ భారత రాజ్యాంగంపై అవగాహన అవసరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ప్రజలందరికీ ఉచితంగా రాజ్యాంగ గ్రంథాన్ని అందించి అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాకేష్, మండల అధ్యక్షుడు సోమిడి నరేష్, మండల ఉపాధ్యక్షుడు గట్టుమల్లు, స్వధర్మం పాదయాత్ర జిల్లా ఇన్‌చార్జ్ అశోక్, నాయకులు గోల్కొండ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నడికూడ : ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రచార కమిటీ అధ్యక్షుడు ప్రతాప్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాజు పూలమాల, యుగేందర్, రత్నాకర్, తిరుపతి, సూర్యం, రవికుమార్, శ్యామ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : డీఎస్పీ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గోల్కొండ రాజేష్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మైదం రవి, నాయకులు సలీం పాషా, లింగమూర్తి, రాజేందర్, నాగరాజు, అశోక్ పాల్గొన్నారు.

పెరుమాండ్ల 'బలగం' సందడి



సమ్మేళనంలో సుందరమ్మ కుటుంబ సభ్యులు

ఆత్మకూరు : సుమారు పదేళ్లుగా దూరం ఉంటున్న పెరుమాండ్ల కుటుంబం 'బలగం' సినిమా స్ఫూర్తితో సందడి చేసింది. ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించింది. మమతానురాగాలకు అద్దం పట్టింది. ఈ ఘటన మండలంలోని నీరుకుళ్లలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన పెరుమాండ్ల సుందరయ్య–రాంచందర్ దంపతులకు ఐదుగురు కొడుకులు, నలుగురు కూతుళ్లు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. వాళ్ల పిల్లలూ పెద్దవాళ్లయ్యారు. పదేళ్లుగా పెరుమాండ్ల కుటుంబీకులు దూరంగా ఉంటున్నారు. ఇటీవల బలగం చిత్రాన్ని ఆ కుటుంబంలోని పలువురు చూసి చలించిపోయారు. తమ అన్నాచెల్లెల్లను గుర్తు చేసుకున్నారు. మళ్లీ అంతా ఒకచోట కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. కాగా రాంచందర్ గతంలోనే మృతి చెందగా సుందరమ్మ 85వ జన్మదిన వేడుకలు ఈనెల 8న అంతా కలిసి ఘనంగా నిర్వహించాలని నిశ్చయించారు. నీరుకుళ్లలోని చెన్నకేశవ స్వామి ఆలయం ప్రాంగణం వేడుకకు వేదికయ్యింది. సోమవారం నాడు సుందరమ్మ కొడుకులు, కూతుళ్లు, మనుమళ్లు, మనవరాళ్లు అంతా గ్రామానికి చేరుకుని ఆమె జన్మదినాన్ని వేడుకగా నిర్వహించారు. మొత్తం 102 మంది సుందరమ్మ జన్మదినానికి హాజరు కావడంతో సందడి నెలకొంది. జన్మదిన సందర్భంగా బలగం చిత్రాన్ని ప్రదర్శించి భావోద్వేగానికి లోనయ్యారు. బతికినంత కాలం ఒకటిగా ఉండాలని నిర్ణయించుకున్నారు. వారి సంతోషానికి అవధుల్లేకుండాపోయాయి. కార్యక్రమంలో పెరుమాండ్ల మల్లికార్జున్, గోవర్ధన్, జనార్ధన్, విజయవర్ధన్, మహేందర్, శాంతక్క, రమ, మాధవి పాల్గొన్నారు.

గద్దెల నిర్మాణం సమంజసం కాదు

● బీజేపీ ఆలేరు పాలక్, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



కమిషనర్‌కు వినపత్రం అందజేస్తున్న నాయకులు

పరకాల : దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయుల విగ్రహాలు నిరాదరణకు గురౌతున్నా పట్టించుకోకుండా వాటి స్థలాల్లో బీఆర్ఎస్ పార్టీ గద్దెలు నిర్మించడం సరికాదని బీజేపీ ఆలేరు పాలక్, మాజీ స్థానిక ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. పరకాల అభివృద్ధికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చీడలా తయారయ్యాడని మండిపడ్డారు. రోడ్డు వెడల్పు పేరుతో అంబేడ్కర్ జంక్షన్‌లో తొలగించిన మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలకు బీజేపీ నాయకులు సోమవారం పాలాభిషేకం చేశారు. అనంతరం సదరు విగ్రహాలను పునరుద్ధరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడారు. పాత ఏటీఎం సెంటర్‌ను మహాత్మాగాంధీ జంక్షన్‌గా, బస్టాండ్ కూడలిని సుభాష్ చంద్రబోస్ జంక్షన్‌గా అభివృద్ధి చేయాలని కోరారు. విదేశాలు భారతదేశ మహనీయులను గౌరవిస్తుండగా పరకాలలో నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. అభివృద్ధిలో పరకాల వెనుకబాటుకు ఎమ్మెల్యే ధర్మారెడ్డి కారణమన్నారు. బీజేపీ గెలుపుతోనే పరకాల అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, కొత్తగూడెం భద్రాద్రి అసెంబ్లీ ప్రబారి దేవునూరి మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్ లాల్, కార్యదర్శి ఎర్రం రామన్న, 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి, పట్టణ ప్రధాన కార్యదరర్శులు గాజుల నిరంజన్, కుక్కల విజయ్, నాయకులు దుబాసి వెంకటస్వామి, దంచనాల సత్యనారాయణ, మారేడుగొండ భాస్కరాచారి, అసెంబ్లీ సోషల్ మీడియా కోకన్వీనర్ మెంతుల సురేష్, పాలకుర్తి తిరుపతి, కానుగుల గోపీనాథ్, కక్కు రాజు, దండు సురేష్, ముత్యాల దేవేందర్, పిట్ట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను వినియోగించుకోండి



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీరాంరెడ్డి

దామెర : జాబ్ కార్డ్ కలిగిన ప్రతిఒక్కరూ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను వినియోగించుకుని లబ్ధి పొందాలని దామెర సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి కోరారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా మండల కేంద్రంలో చేపట్టిన పాలుమారుగెట్టు బాట (మట్టి రోడ్డు) పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బావుల వద్దకు వెళ్లే రైతుల కోసం మట్టి రోడ్డు నిర్మిస్తున్నట్టు తెలిపారు. మట్టి రోడ్డు ఏర్పాటుతో బావుల వద్దకు వెళ్లే రైతుల సమస్య తీరనుందని చెప్పారు. పనులను కూలీలందరూ తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ శారద, పీఏసీఎస్ డైరెక్టర్ మాదారపు రతన్‌కుమార్, వార్డు సభ్యులు వేల్పుల రాజ్‌కుమార్, వంగ రవి, పెంట రమేష్, టీఏ సురేందర్, పంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, కారోబార్ మాదారపు బొబ్బిలి తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

నడికూడ : మండలంలోని పులిగిల్లలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ పాలకుర్తి సదానందం సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంధత్వ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దయ్యాల కవిత, డాక్టర్ మౌనిక, డాక్టర్ కిరణ్, వైద్య బృందం పి.దీపిక, శారద, సరోజన, ఆశ వర్కర్లు తిరుమల, రేణుక, రమాదేవి పాల్గొన్నారు.